సాక్షి కామారెడ్డి


శుక్రవారం । 16 । మే । 2025



కేసులను పెండింగ్‌లో పెట్టొద్దు

పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర సూచించారు.

- 8లో ▸



జీవాల కోసం వలస బాట

సంగారెడ్డి జిల్లాకు చెందిన కాపర్లు పశువులకు తాగునీరు, మేత లేక పోవడంతో వలస బాట పట్టారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

38.7 /22.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తగ్గవచ్చు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఈ పాస్'తోనే ఎరువులు విక్రయించాలి



కామారెడ్డి క్రైం: కేంద్రప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి డీలర్ ఈ పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులను విక్రయించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని 360 మంది ఎరువుల డీలర్లకు ప్రస్తుతం వాడుతున్న ఎల్–0 రకం ఈ పాస్ మిషన్ల స్థానంలో కొత్తగా వచ్చిన ఎల్–1 ఈ పాస్ మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎరువులు విక్రయించే డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతుల ఆధార్‌తో అనుసంధానం చేస్తూ ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, ఏడీఏలు, ఏవోలు, డీలర్లు, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కామారెడ్డి క్రైం: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని వరుణ్ మోటార్స్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, మెకానికల్ ఇంజినీరింగ్, డిప్లొమా చదివిన వారు అర్హులని, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోగా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 98854 53222, 76719 74009 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

ఎక్కువ లాభాలు అర్జించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): పంటల సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అర్జించాలని జేడీ తిరుమల ప్రసాద్ అన్నారు. లింగంపేట మండలం మోతె గ్రామంలోని రైతు వేదికలో గురువారం 'రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ రైతులకు పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. సాగునీరు, పంటల సాగు యాజమాన్యంపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అంజయ్య, భాస్కరన్, అనిల్ కుమార్, రత్నం, జ్యోతి, అనిల్‌రెడ్డి, రేవంత్‌నాథన్, గ్రామపెద్దలు రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఇసుక తుపాన్

మంజీర పరీవాహక ప్రాంతమైన బిచ్కుంద మండలం ప్రతిరోజూ వార్తల్లో నిలుస్తోంది. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఇసుక తుపానులో కొట్టుకుపోతున్నారు. గతంలో కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులపై వేటుపడిన విషయం తెలిసిందే. తాజాగా ఏసీబీ అధికారులు బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. ఇసుక అక్రమ రవాణా ఫిర్యాదుల నేపథ్యంలోనే సోదాలు చేపట్టారు.

- వరుస వివాదాల్లో బిచ్కుంద పోలీసు, రెవెన్యూ అధికారులు
- పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలతో కలకలం
- అయినా మారని తీరు.. కొనసాగుతున్న వసూళ్లు
- ఏడు పాయింట్ల నుంచి యథేచ్ఛగా రవాణా

బిచ్కుంద(జుక్కల్): జిల్లాలో ఎక్కడా లేని విధంగా బిచ్కుంద మండలంలో ఏడు ఇసుక పాయింట్లు ఉన్నాయి. మంజీరా నది పరీవాహక గ్రామాలైన బండారెంజల్, గుండెనెమ్లి, వాజీద్‌నగర్, పుల్కల్, హజ్గుల్, శెట్లూర్, ఖద్గాం గ్రామాల పరిధిలో మంజీరాలో కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు ఉండగా, అనుమతుల పేరుతో కొందరు.. అక్రమంగా కొందరు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. పుల్కల్, హజ్గుల్, శెట్లూర్, ఖద్గాం గ్రామాలకు చెందిన కొందరు యువకులు ఇసుక మాఫియా అవతారమెత్తారు. ఇసుక అక్రమ రవాణాకు పూర్తిగా సహకరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు లక్షల్లో వసూళ్లకు పాల్పడుతూ వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఇప్పటికే పలువురు పోలీసు, రెవెన్యూ అధికారులపై వేటుపడింది.



బిచ్కుంద పోలీస్ స్టేషన్

2012లో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏలపై సస్పెన్షన్ వేటుపడింది. అలాగే సుమారు మూడేళ్ల క్రితం బిచ్కుంద, మద్నూర్ పోలీసు సిబ్బంది నలుగురిని అప్పటి ఎస్పీ సస్పెండ్ చేశారు. బిచ్కుందలో పని చేసిన ఎస్సై ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని ఓ కాంట్రాక్టర్‌కు ఇసుక అమ్మేసుకోగా ఆయనను బదిలీ చేశారు. ఇలా చాలా మంది ఎస్సైలు, సీఐలు, తహసీల్దార్లు, ఆర్ఐలు అవినీతి మసిపూసుకుని వెళ్లారు. పదేళ్ల కాలంలో కొందరు ఉన్నతాధికారులకు చిక్కగా కొందరు అప్రమత్తమై బదిలీపై వెళ్లిపోయారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ఫిర్యాదుల నేపథ్యంలో బోధన్ సబ్ కలెక్టర్ నేరుగా హజ్గుల్ మంజీరా నదిలోకి వెళ్లారు. వందల ట్రాక్టర్లు ఇసుక నింపుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా 40 ట్రాక్టర్లను పట్టుకున్నారు. డ్రైవర్లు, ఓనర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

హైకోర్టుకు బార్ అసోసియేషన్..

మంజీరా క్వారీ నుంచి ఇసుక తరలించేందుకు ఒకచోట అనుమతి పొంది మరోచోట ఇసుక తవ్వుతున్నారని, అక్రమంగా వందల లారీలు, ట్రాక్టర్లలో ఇసుక తరలించి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని బిచ్కుంద బార్ అసోసియేషన్ గతేడాది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. స్పందించిన హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించింది. ఈ వ్యవహారంలో సంబంధిత జిల్లా అధికారులకు నోటీసులు జారీ కావడంతో ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ పడింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి దాడులు చేస్తే ఇసుక అక్రమ రవాణాను అరికట్టొచ్చని ప్రజలు అంటున్నారు.

పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఏసీబీ సోదాలు

పుల్కల్, హజ్గుల్, శెట్లూర్, ఖద్గాం గ్రామాలకు చెందిన కొందరు ఇసుక మాఫియా అవతారమెత్తారు. రాత్రి వేళల్లో వందలాది ట్రాక్టర్లతో ఇసుకను మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. మామూళ్లు తీసుకుంటూ ఇసుక అక్రమ రవాణా సాఫీగా సాగేలా రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఏసీబీకి సైతం ఎన్నో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాలో అధికారులు పాత్రపై రెండేళ్లుగా ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈనెల 14వ తేదీన బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను వదిలిపెట్టేందుకు డబ్బులు డిమాండ్ చేశారని, ఇసుక అక్రమ రవాణాకు కొందరు పోలీసు సిబ్బంది సహకరిస్తూ మామూళ్లు పుచ్చుకున్నట్లు విచారణలో గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు. సస్పెన్షన్ వేటు పడుతున్నా అధికారుల తీరు మారడం లేదు. నాటి నుంచి నేటి వరకు బిచ్కుంద మండలంలో ఇసుక వివాదం కొనసాగుతూనే ఉంది.

మాట నిలుపుకున్న సీఎం రేవంత్



ఇళ్ల నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేస్తున్న షబ్బీర్

- కాంగ్రెస్ పార్టీ మాట తప్పదు.. మడమ తిప్పదు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- చిన్నమల్లారెడ్డిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కామారెడ్డి రూరల్: కాంగ్రెస్ మాట తప్పదని, మడమ తిప్పదని, తమది పేదల పక్షపాతి అని రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. 2023 మార్చి 18 తేదీన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో భాగంగా కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అకాల వర్షాల కారణంగా కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులైన భిక్కనూరి లక్ష్మి, చిట్యాల రాజమణి, భిక్కనూరి రేఖ శ్రీకాంత్‌కు తాము అధికారంలోకి రాగానే ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. షబ్బీర్ గురువారం మార్క్ అవుట్, భూమిపూజ చేసి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా పేదలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించి ఫామ్‌హౌస్‌లో పడుకొని ఇది చేయలేదు, అది చేయలేదంటున్నారన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత తాను స్వయంగా లేదా వర్చువల్ ద్వారా గృహప్రవేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిపారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు 3028 ఇళ్లు నిరుపేదలకు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్, కైలాస్ శ్రీనివాస్‌రావు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల రాజిరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో హెప్సిబా రాణి, అన్నాల గంగయ్య, రామాగౌడ్, ఆనంద్‌రావు, కొర్మిభీంరెడ్డి, నిమ్మ విజయ్‌కుమార్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సేకరణ, చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద చేపట్టిన ప్యాకేజీ – 22 పనుల పురోగతి, భూసేకరణ, పరిహారం, చెల్లింపులు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పనులకు సంబంధించి భూసేకరణ కోసం ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.23.15 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. భూసేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ దశల్లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ టి శ్రీనివాస్, ఎల్లారెడ్డి ఈఈ ఎం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

ఆర్టీసీ స్మార్ట్ సేవలు

- క్యూఆర్ కోడ్‌లో ఆర్టీసీ సమాచారం
- స్కాన్ చేస్తే చాలు కళ్ల ముందు అన్ని రకాల సేవలు
- ప్రయాణికులకు ప్రత్యేక కీ చైన్‌లు

కామారెడ్డి టౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రగతి రథం పరుగులు పెడుతోంది. ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తూనే సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఇప్పటికే ప్రయాణికుల కోసం అనేక రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజాగా క్యూఆర్ కోడ్ కీ చైన్‌ల సేవలతో మరింత స్మార్ట్ అయ్యింది. ప్రత్యేకంగా తయారు చేసిన తెలంగాణ ఆర్టీసీ సంస్థ కీ చైన్‌లపై క్యూ ఆర్‌కోడ్‌ను ముద్రించి ప్రయాణికులకు అందజేస్తోంది. దీన్ని స్కాన్ చేస్తే పూర్తి సమాచారం మన అరచేతిలో ఉంటుంది.

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. అందుకు తగినట్లుగా ఆర్టీసీ సమాచారాన్ని చేరువ చేస్తోంది. కీ చైన్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీ అందించే సేవలు కనిపిస్తాయి.

కావాల్సిన వివరాలు ప్రత్యక్షం

ఫోన్‌లో గూగుల్ ఓపెన్ చేసి పైన కనిపించే కెమెరాపై క్లిక్ చేయాలి. అనంతరం కీ చైన్‌పై రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కావాల్సిన వివరాలు ప్రత్యక్షమవుతాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో మన వివరాలు పొందుపరిస్తే దీన్ని వినియోగించుకోవడం మరింత సులభమవుతుంది. సలహాలు, సమస్యలపై సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. వివాహాది శుభకార్యాలతోపాటు విహార యాత్రలకు బస్సులను రాయితీపై బుక్ చేసుకొనే విధానం కూడా అందుబాటులో ఉంది.



జిల్లా అధికారులకు క్యూ ఆర్ కోడ్ కీ చైన్‌లు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం కరుణశ్రీ

పది రకాల యాప్‌లు

ఆర్టీసీ అందించే కీ చైన్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పది రకాల యాప్‌లు ఉంటాయి. గమ్యం యాప్ ద్వారా మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుంది. గమ్యానికి ఎప్పుడు చేరుకోవచ్చు వంటి వివరాలు తెలుసుకునే వీలుంటుంది. లైవ్ ట్రాకింగ్, టికెట్ బుకింగ్ తదితర సేవలతోపాటు ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ చానల్, యూట్యూబ్ వంటివి కనిపిస్తాయి.

ప్రజలకు మరింత చేరువయ్యేలా



ఆర్టీసీ కీచైన్‌లను ప్రయాణికులకు బహుమతుల రూపంలో ప్రత్యేక సందర్భాల్లో, ఉచితంగా అందజేస్తున్నాం. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండటం, మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న కీచైన్‌లను ఆర్టీసీ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలా సులువుగా సేవలు పొందొచ్చు. సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– కరుణశ్రీ, ఆర్టీసీ డిపో మేనేజర్, కామారెడ్డి

జీపీలకు నీడేది..?

ఇసన్నపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనుల కోసం ఈ ఫొటోలో కనిపిస్తున్న శిలాఫలకాన్ని 2018 ఆగస్టు 1నాడు వేశారు. రూ.16లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టేందుకు ఉద్దేశించి పనులకు నాటి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నేటి వరకు పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు.



- భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం
- శిలాఫలకాలు వేసి ఏళ్లు గడుస్తున్నా ఫలితం లేదు..
- పలు చోట్ల స్థలాల కొరత
- సొంత భవనాలు లేక అస్తవ్యస్తంగా పాలన

రామారెడ్డి: జిల్లాలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం పరిపాలనకు శాపంగా మారింది. గత ఆరేళ్లుగా అద్దె, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాత్కాలిక భవనాల్లో పంచాయతీలు కొనసాగుతున్నాయి. గ్రామ సభలను సైతం ఆరు బయటే నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ సామగ్రిని భద్రపర్చడం జీపీ సిబ్బందికి సవాలుగా మారింది. గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని అప్పటి సర్పంచులు అధికారులకు మొర పెట్టుకోవడంతో గతంలో సొంత భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో ప్రస్తుతం 526 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 204 కొత్తగా ఏర్పడ్డాయి. 2022 – 23, 2023 –24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 197, ఎస్టీఎస్‌డీఎఫ్ పథకంలో మరో 38 పంచాయతీ భవన నిర్మాణాలకు రూ.47 కోట్లు కేటాయించారు. ఇందులో 35 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి 81 నిర్మాణాలు ప్రారంభమే కాలేదు. ఒక్కో గ్రామపంచాయతీ నిర్మాణానికి రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షలు వెచ్చించాలని నిర్ణయించారు.

పనులే మొదలు కాలేదు

గతంలో వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తుండగా ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో కేవలం ఎస్టీ నివాసాలైనా తండాల్లో భవనాలు నిర్మించాలనే నిబంధన ఉంది. దీనికింద 38 భవనాల నిర్మాణ పనులకు రూ.7.60 కోట్లు మంజూరు కాగా, టెండర్లు ఖరారు చేయాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. టెండర్ల ప్రక్రియ దగ్గరనే పనులు పురోగతి ఆగిపోయింది.

స్థలాల కొరత ఇబ్బందే..

2016 అక్టోబర్ 11 నాడు రామారెడ్డి మండల కేంద్రంగా ఏర్పాటు కావడంతో రామారెడ్డి గ్రామపంచాయతీ భవనాన్ని తాత్కాలికంగా పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా నేటికీ గ్రామపంచాయతీ భవనంలోనే పోలీస్ స్టేషన్ కొనసాగుతోంది. రామారెడ్డి గ్రామపంచాయతీని ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని ఆయుర్వేదిక్ విభాగానికి చెందిన చిన్నరూములో కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో స్థలాల కొరత పెద్ద సమస్యగా మారింది. కార్యాలయాలు గ్రామానికి మధ్యలో ఉంటే అందరికీ అందుబాటులో ఉంటాయి. కానీ గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసే స్థోమత కొన్ని గ్రామ పంచాయతీలకు లేదు. బిల్లులు సకాలంలో వస్తాయో.. రావో.. అనే అనుమానంతో కాంట్రాక్టర్లు సైతం పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

ఈ ఫొటోలో కనిపిస్తోంది రామారెడ్డి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం. పనులు శంకుస్థాపన దశ వద్దే నిలిచిపోయాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.16లక్షలతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. శిలాఫలకం శిథిలావస్థకు చేరుకునే దశకు వచ్చినా పనులు ప్రారంభం కాలేదు.



ఉపాధి నిధులు మంజూరైన జీపీ భవనాలు	197
మంజూరైన నిధులు రూ.కోట్లలో..	30.40
పూర్తయిన భవనాలు	35
ప్రారంభం కానివి	50
పురోగతిలో ఉన్నవి	112

ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో మంజూరైనవి	38
మంజూరైన నిధులు రూ.కోట్లలో..	7.60
పురోగతిలో ఉన్నవి	7
ప్రారంభం కానివి	31

పరిహారం పరిహాసం

- రూపాయి చెల్లించకుండా 765–డీ విస్తరణ పనులు
- మిగిలిన జాగాల్లో నిర్మాణం చేస్తే నోటీసులు
- అధికారులను ఆశ్రయిస్తున్న బాధితులు



దేశాయిపేట్ శివారులో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంతోపాటు వివిధ మండల కేంద్రాల్లో ఎన్‌హెచ్ 765–డీ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో చాలా మంది తమ ఇళ్లను, స్థలాలను కోల్పోయారు. పరిహారం ఇస్తామని చెప్పి పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు బాధితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఎన్‌హెచ్ 765–డి నంబర్ జాతీయ రహదారి మెదక్–ఎల్లారెడ్డి–బాన్సువాడ–రుద్రూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నాగిరెడ్డిపేట్ మండలం పోచారం నుంచి వయా ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల మీదుగా రుద్రూర్ వరకు కొత్త రహదారి రూపు దిద్దుకొంటుంది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నిర్మాణానికి రూ.499 కోట్లు మంజురు కాగా రూ.313 కోట్లకు టెండర్ దాఖలైంది. కేంద్రం అనుమతించగా అలైన్‌మెంట్ ఖరారు చేసి పనులు ప్రారంభించారు. పోచారం నుంచి రుద్రూర్ వరకు 51.66 కిలోమీటర్ల 765–డి రోడ్డును కేంద్ర ప్రభుత్వం విస్తరిస్తోంది. బాన్సువాడ పట్టణంతోపాటు ముఖ్యమైన మండల కేంద్రాలైన నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్, కొత్తబాద్, దుర్కి, నెమ్లి, నస్రూల్లాబాద్, వర్ని, అక్బర్ నగర్, రుద్రూర్‌లో చాలా మంది ఇళ్లు, స్థలాలు కోల్పోయారు. ఆయా గ్రామాల్లో కొందరు స్థలాల యజమానులు నిర్మాణాలు చేపడితే నోటీసులు కూడా జారీ చేస్తున్నారు. గతంలో మెదక్–సిద్దిపేట్ రోడ్డు విస్తరణ పనుల్లో బాధితులకు పరిహారం అందించారు. కానీ నాగిరెడ్డిపేట్–ఎల్లారెడ్డి– మహ్మద్‌నగర్– కొత్తాబాది– బాన్సువాడ– దుర్కి–నస్రూల్లాబాద్–వర్ని–అక్బర్‌నగర్–రుద్రూర్ మండల కేంద్రాల్లోని బాధితులకు పరిహారం అందడం లేదు. బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఎల్లారెడ్డి–రుద్రూర్ రోడ్డు నిర్మాణానికి 150 ఫీట్లతో భూసేకరణ జరిగింది. పనులు కూడా చేపడుతున్నాం. మెదక్–సిద్దిపేట్ రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం అందించారు. అందులో భాగంగానే 765–డీ విస్తరణలో పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. పరిహారం మంజూరు కాగానే రోడ్డు విస్తరణలోకి వచ్చిన ఇళ్లు, స్థలాల యజమానులకు పరిహారం అందిస్తాం. ముందుగా సమస్యలు లేని చోట పనులు చేపడుతున్నాం.

– ప్రవీణ్‌రెడ్డి, డీఈఈ నేషనల్ హైవే, బాన్సువాడ

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను పరిశీలిస్తున్న ఎన్‌ఏక్యూఎస్ బృందం

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఏర్పాటు చేసినట్లు డిక్యూఎంఏఎస్ (జిల్లా క్వాలిటీ అసెస్‌మెంట్ అధికారి) రాధిక అన్నారు. గురువారం ఎన్ఏక్యూస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సంస్థ బృందం సభ్యులు లింగంపేట మండలం మోతె, పొల్కంపేటలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజారోగ్య సేవల నాణ్యతను పెంపొందించడానికి ఏర్పాటు చేసిన సంస్థ అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో ఆరోగ్య సేవలను, నాణ్యతను పరిశీలించారు. ఉత్తమ సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలను వైద్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డీపీవో పద్మజ, దిఖ్యం జహీరా, వైద్యాధికారి రాంబాయి, సీహెచ్‌వో రమేశ్, ఫరిదా, యాదగిరి, గణేష్, రాజేశ్వరీ, ఎలిజబేత్, విజయకుమారి, రజిని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ ఐక్యత కోసం కలిసి పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

రాజంపేట : మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ఉండరాదని అందరూ పార్టీ కోసం ఐక్యతతో పని చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేట గ్రామంలో నెలకొన్న ఇందిరమ్మ ఇళ్ల గందరగోళ విషయంపై ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరు డబ్బులు వసూలు చేసినట్లు నిరూపణ జరిగినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, రాబోయే స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖలో ఘటనపై విచారణకు ఆదేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): మరణించిన ఉద్యోగికి సంబంధించిన ఫ్యామిలీ బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో ఇబ్బందులు పెడుతున్నారనే ఆరోపణలపై నిజామాబాద్ రూరల్ వ్యవసాయాధికారిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ విచారణకు ఆదేశించింది. విచారణ అధికారులుగా సింగారెడ్డి, శివాజీ పాటిల్‌లను నియమించింది. వీరు హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చి శుక్రవారం బాధిత కుటుంబాన్ని, అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని విచారించనున్నారు. ఇటు టీజీవో ఆధ్వర్యంలో కలెక్టర్, డీఏవోకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

సాక్షి కథనాలు.. పరిష్కారాలు

ప్రజా సమస్యలు వెలుగులోకి..

- ప్రచురితమైన కథనాలకు స్పందన
- బిచ్కుంద మండలంలో సమస్యలు పరిష్కరించిన అధికారులు



స్పందన తర్వాత.. పరిశీలిస్తున్న డీపీవో



మురికికూపంగా బస్టాండ్ ప్రచురితమైన కథనం

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మండలంలోని ప్రజా సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చి కథనాలను ప్రచురించి ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఎన్నో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించింది. బాధితుల పక్షాన ఉంటూ మన్ననలు పొందుతోంది. ఏప్రిల్ నెలలో బిచ్కుంద మండలంలో ఏడు సమస్యలు ప్రచురించగా అధికారులు పరిష్కరించారు. 6వ తేదీన దౌల్తాపూర్‌ను వణికిస్తున్న విషజ్వరాలు.. కథనాలతో వైద్య ఆరోగ్య శాఖ స్పందించి మూడు రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్తనమూనాలు సేకరించి వైద్యం అందించారు. 10న మురికి కూపంగా బస్టాండ్.. కథనంతో డీపీవో మురళి స్పందించి బిచ్కుంద ఆర్టీసీ బస్టాండ్ సందర్శించి మురికి తొలగించి శుభ్రం చేయించారు. 16న ప్రమాదకరంగా ముళ్లపొదలు... కథనం



బస్టాండ్‌లో మురికిని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

ప్రచురించగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బిచ్కుంద-కందర్‌పల్లి రోడ్డు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను ప్లాకెయిన్‌తో తొలగించి శుభ్రం చేయించారు. 18న ఆడవాళ్ల ఆత్మగౌరవం పట్టదా... ప్రచురించిన కథనానికి బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరితాదేవి స్పందించి మరుగుదొడ్ల విరిగిన తలుపులకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. 24న స్కావెంజర్ డబ్బులు కాజేత... వచ్చిన కథనానికి విద్యా శాఖ




వణికిస్తున్న విష జర్వాలు ప్రచురించిన కథనం



స్పందన కథనం

అధికారులు స్పందించి విచారణ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం కాజేసిన స్కావెంజర్ రూ.13 వేలు తిరిగి ఇచ్చేశారు. మే 2న పడకేసిన పారిశుధ్యం...అనే వచ్చిన కథనానికి అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి చొరవచూపి పారిశుధ్య పనులు చేయించి దౌల్తాపూర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించారు. మాతాశిశు సంరక్షణ కార్డుల కొరత... ఎన్నో కథనాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



స్కావెంజర్ డబ్బులు కాజేత ప్రచురించిన కథనం స్పందన కథనం ప్రమాదకరంగా ముళ్ల పొదలు ప్రచురించిన కథనం స్పందన కథనం

కేసులను పెండింగ్ లో పెట్టొద్దు

- ఎస్పీ రాజేష్ చంద్ర



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సాయంత్రం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులోనూ నాణ్యవంతమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. గంజాయి, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలనీ, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల ను ఏర్పాటు చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రెంజల్(బోధన్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన సోహైల్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఆయన ఫిర్యాదు మేరకు ట్రేస్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గురువారం బాధితునికి ఫోన్ అప్పగించినట్లు చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్ గణేశ్ ఉన్నారు.

మారుతున్న కాలంతోపాటు టీచర్లు అప్డేట్ కావాలి

- ఉమ్మడి జిల్లా డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కామారెడ్డి రూరల్: మారుతున్న కాలంతోపాటు ఉపాధ్యాయులు అప్డేట్ కావాలని నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచించారు. గురువారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని జెడ్పీహెచ్ ఎస్‌లో నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ఏ డిజిటల్ ఉపకరణం కాదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంచాలని, సామాజిక సర్దుబాటులు నేర్పించాలని ఉపాధ్యాయులకు



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి మండల విద్యాధికారి వై. ఎల్లయ్య, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డా. సుభాష్, డీఆర్పీలు ప్రసూన్, బాలరాజ్, రాజభైరయ్య, ఎనిమిది మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా మే నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే సంబంధిత రేషన్ షాపుల్లో బియ్యం తీసుకోవాలని అధికారులు సూచించారు.

ప్రమాదకరంగా ప్రయాణం

రామారెడ్డి : రామారెడ్డి రూట్లో గతంలో కంటే తక్కువ బస్సులు తిరుగుతున్నాయని ప్రయాణికులు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి



రామారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్న బస్సులో ఫుట్ బోర్డుపై నిలబడిన ప్రయాణికులు

బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

- ఇందిరమ్మ ఇల్లు రాలేదని నిరసన
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీతో దిగివచ్చిన వ్యక్తి

నిజామాబాద్ రూరల్: అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఓ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేస్తూ, సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా.. మండలంలోని మల్లారం గ్రామనికి చెందిన ఎం. సాయిలు అనే వ్యక్తి ఇందిరమ్మ ఇల్లుకు అర్హత ఉందని, ఇటీవల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాడు. కానీ అధికారులు అనర్హతగా ప్రకటించడంతో గురువారం అతడు మల్లారం గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఫోన్లో అక్కడ ఉన్న స్థానిక నాయకులతో మాట్లాడి సెల్ టవర్ ఎక్కిన సాయిలుకు కాన్ఫరెన్స్ ద్వారా ఫోన్‌లో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన



సెల్‌టవర్ దిగి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సాయిలు సెల్‌టవర్ దిగడంతో మల్లారం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నగరంలో సైబర్ మోసం

- లింక్ ఓపెన్ చేసి, రూ.1.48లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ ఉద్యోగి

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి బ్యాంక్ ఖాతాల నుంచి సైబర్ మోసగాళ్లు రూ.1.48 లక్షలు కాజేశారు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపిన వివరాలు ఇలా.. రిటైర్డ్ ఉద్యోగి ఇటీవల ఫోన్‌పే పని చేయకపోవడంతో బ్యాంక్ అధికారులను సంప్రదించారు. దీంతో బ్యాంక్ సిబ్బంది గూగుల్‌పే లేదా ఫోన్‌పే కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈక్రమంలో సదరు వ్యక్తి గూగుల్‌లో సెర్చ్ చేసి ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. అనంతరం వేరే ఫోన్ నెంబర్ నుంచి సైబర్ మోసగాళ్లు కాల్ చేసి ఓ లింక్ పంపిస్తున్నామని చెప్పి పంపించారు. వెంటనే అతడు లింక్ ఒపెన్ చేయడంతో బాధితుడికి ఉన్న యూనియన్‌బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, పంజాబ్‌నేషనల్ బ్యాంక్‌ల ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.48 లక్షలను కాజేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాం

నిజామాబాద్ అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను యథావిధిగా చేపడుతామని టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ అన్నారు. నగరంలోని టీఎన్జీవోస్ జిల్లా కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ వేసిందని, ఇది మొదటి విజయంగా భావిస్తున్నామన్నారు. ఆపరేషన్ సిందూర్ వలన ఉద్యమ కార్యాచరణ ఉన్నప్పటికీ వాయిదా వేశామన్నారు. కానీ మళ్లీ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా సహ అధ్యక్షుడు పెద్దల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, కోశాధికారి దినేష్ బాబు, ముఖ్య సలహాదారులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మన్ మృతి

బోధన్ రూరల్: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై అసిస్టెంట్ లైన్‌మన్ మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఎడిపల్లి మండల కేంద్రానికి చెందిన బి మహేందర్(34) బోధన్ సబ్‌స్టేషన్ పరిధిలోని బెల్లాల్ ప్రాంతంలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజీవ్‌నగర్ తండాలో చిన్నపాటి విద్యుత్ మరమ్మతులు ఉండటంతో గురువారం అతడు ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకోకుండా మరమ్మతులు చేపట్టాడు. ఈ క్రమంలో పైనున్న 11 కెవి విద్యుత్ తీగలు తగలడంతో అతడికి తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి, అక్కడి నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్, అధికారులు ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.



మహేందర్ (ఫైల్)

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మద్యం మత్తులో కన్న కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన ఘటన లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఈకల సంగయ్య మద్యం మత్తులో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. భార్య శ్యామవ్వ, పెద్ద కుమారుడు కుమార్, చిన్న కుమారుడు అఖిల్, తండ్రి సంగయ్యల మధ్య గొడవ జరిగింది. పెద్ద కుమారుడు కుమార్ తండ్రికి వ్యతిరేకంగా మాట్లాడడంతో అతడిపై తండ్రి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో కుమార్‌కు వీపు, మెడ బాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం లింగంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఎస్సై వెంకట్రావును ఫోన్‌లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

గృహహింస కేసులో భర్తకు మూడేళ్ల జైలు

రెంజల్(బోధన్): భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడంతో పాటు విడాకులు ఇవ్వకుండానే రెండో వివాహం చేసుకున్న భర్తకు బోధన్ కోర్టు 3ఏళ్ల జైలుతోపాటు రూ.1500 జరిమానా విధించినట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. బోధన్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన బండారు సుభాష్ అనే యువకుడికి, రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే యువతితో 2012లో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలకు దంపతులకు అబ్బాయి పుట్టాడు. అప్పటినుంచి భర్త అదనపు కట్నం కోసం భార్యను వేధించడం ప్రారంభించాడు. శారీరకంగా, మానసికంగా హింసించడంతోపాటు రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో అతడి బాధలు భరించలేక 2016లో బాధితురాలు రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారించిన బోధన్ కోర్టు అదనపు న్యాయమూర్తి గురువారం శిక్ష విధించినట్లు చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడిపిన 32 మంది పట్టుబడ్డారు. వీరికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపరచగా 27 మందికి రూ.38500 జరిమానా విధించారు. అలాగే ఇద్దరికి ఒక రోజు, ముగ్గురికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి



నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి): మండలంలోని జలాల్‌పూర్ గ్రామశివారులో గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మేక మృత్యువాత పడింది. మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన చిన్నన్న అంజయ్య రోజూలాగే గురువారం తన మేకల మందను తీసుకొని మేతకోసం జలాల్‌పూర్ శివారుకు వెళ్లాడు. కాగా ఇటీవల కురిసిన గాలివానకు జలాల్‌పూర్ శివారులో విద్యుత్‌స్తంభం నుంచి విద్యుత్‌వైరు ఊడిపోయి కిందపడింది. కిందపడిన వైరును గమనించక మేకలమంద అటువైపు వెళ్లగా మందలోని ఓ మేక ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ప్రమాదంలో మృతిచెందిన మేక విలువ సుమారు రూ.10వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కాగా విద్యుత్‌వైరు నేలపై పడిన వైపు మనుషులెవరూ వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు, పశువైద్య సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగినతీరును తెలుసుకున్నారు.


ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని కొండాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎమ్మార్వై గంగరాజం గురువారం పట్టుకొని పంచనామా చేసి పోలీసులకు అప్పగించారని ఎస్సై రామ్ తెలిపారు. కొండాపూర్‌కు చెందిన ట్రాక్టర్ యాజమాని మామిడి నర్సయ్య, డ్రైవర్ రామకృష్ణ, మెట్టుమర్రి తండాకు చెందిన మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌స్నాచింగ్ ముఠా అరెస్టు





వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య.. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఆర్మూర్‌టౌన్: ఆటోలో ప్రయాణించే మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన చైన్ స్నాచింగ్ బాధితురాలు బొబ్బిలి లక్ష్మి ఇటీవల ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ మార్గం వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన ఏడుగురు నిందితులు కూలీ పనుల పేరుతో నిర్మల్ జిల్లాలోని తిమ్మాపూర్, మంజులపూర్ ప్రాంతాల్లో నివసిస్తూ, మహిళల మెడల నుంచి బంగారు గొలుసులు చైన్ స్నాచింగ్ చేసినట్లు నిర్ధారించారు. కాగా వారి వద్ద నుంచి 12.2 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైకులు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠాను పట్టుకోవడంలో కృషిచేసి పోలీసులకు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన యేసుదాస్, మంజుల ఇద్దరు కలిసి గురువారం రాత్రి బైక్‌పై నిజామాబాద్‌కు బయలుదేరారు. బర్దిపూర్ శివారులోని ఫంక్షన్‌హాల్ సమీపంలో వీరి బైక్‌ను ఓ కారు వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడిపోయి గాయపడ్డారు. స్థానికులు వెంటనే గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంజుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు.